చాలా మంది డాక్టర్లు కాంట్రాక్టర్లు ఇంజనీర్లు వ్యాపారస్తులు ఇండస్ట్రియలిస్టులు లాయర్లు వీరంతా తమ తమ పరిధిలో డబ్బు సంపాదిస్తూ తమని రక్షించటానికి ఒక పటిష్టమైన వ్యవస్థని నిర్మించుకుని దానికి కాపలాగా రాజకీయ నాయకున్ని పెట్టుకున్నాడు. ఆ నాయకుడు వీరందర్నీ తినేసే తెలివైనవాడుగా మారాడు. బలవంతుల్ని చేరదీసి తన స్థానం పటిష్టం చేసుకున్నాడు ఆ బలవంతుడు తిరిగి తన స్వార్థం కోసం కొద్దికొద్దిగా విజృంభిస్తున్నాడు. లేకపోతే ఎప్పుడన్నా మన చరిత్రలో వుందా నాన్న కోర్కెలు తీర్చుకోవటం కోసం విమానాల్ని హైజాక్ చేయటం? వివాహానికి వచ్చిన వాళ్ళందర్నీ టెర్రరిస్టులు చంపటం? బస్సు ఆపి ప్రత్యర్థుల్ని గొడ్డళ్ళతో నరకటం కోర్టులని రాజకీయ నాయకులు విమర్శించటం కేంద్రం రాష్ట్రం శత్రువుల్లా ప్రవర్తించటం హిట్ లిస్ట్‌లో వున్న వాళ్లని రక్షించటం కోసం ప్రభుత్వం కోట్లు కోట్లు ఖర్చు పెట్టవలసి రావటం ఇవి ఇంతకు ముందు వున్నాయా నాన్నా? ఇదంతా ఓ గేమ్ నాకు దు:ఖం వస్తుంది. ఒక సామాన్యునిగా నేనీ పరిణామాన్ని చూసి దు:ఖిస్తున్నాను గత పది సంవత్సరాల్లో..... పెరిగిపోయిన టెర్రరిజం తరిగిపోయిన నైతిక విలువలు, క్షుద్ర రాజకీయాలు భద్రతా రాహిత్యం ఎంతగా పెరిగిపోయిందో చూసి నాకు భయం వేస్తోంది. దీని కంతటికీ కారణం ఎవరు అని ప్రశ్నించుకుంటే సమాధానం ....... తెలివైన వాళ్ళు!

అవున్నాన్నా నీలాంటి వాళ్ళే!

ఈ ప్రపంచంలో తొంభై శాతం నాలాంటి సామాన్యులైతే కేవలం పదిమంది మాత్రమే నీలాంటి మేధావులు నీలాంటి గ్రేట్ క్రిమినల్ లాయర్లని ముఖ్యమంత్రులు సన్మానం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. నీలాంటి తెలివైనవాళ్ళు ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారు. తమ భవిష్యత్తుని మీలాంటి వాళ్ళ చేతుల్లో పెట్టి మీరేదో చేస్తారని ఆశగా చూస్తారు సామాన్యులు.

ఈ వ్యవస్థని నిర్మించింది నీలాంటి వాళ్ళే.

కానీ మీరు చేస్తున్నది ఏమిటి? అడవులు నరకటం నుంచి సారా పంచడం వరకూ ప్రేక్షకుల్లో కోర్కె రెచ్చగొట్టే సినిమాల నిర్మాణం నుంచీ ఫైనాన్స్ కంపెనీల మోసాల వరకూ ఎక్కడ చూసినా ఏ రకంగా చూసినా తెలివైన వారు చేసే ఎక్స్‌ప్లాయిటేషనే పదిశాతం మేధావులు తొంభయి శాతం ప్రజల్ని చేసేది మోసమే మర్రిచెట్టుకి వివిధ రకాలుగా ఊడలు వచ్చినట్టే ఈ నిర్మాణ సాధనంలో గూండాలు రౌడీలు పైరవీకార్లు చోటా మంత్రులు తమ తమ పబ్బం గడుపు కోవటానికి బయలుదేరారు. నీలాంటి వాళ్ళ అండతోనే స్వామిలాంటి కుహనా మేధావులు నియంతలై ప్రధానులై ముఖ్యమంత్రులై పతిపక్ష నాయకులై ఉపన్యాసాల్తో ఊకదంపుడు తిట్లతో పరిపాలనా కాలంలో సగభాగం ఒకరి నొకరు విమర్శించుకుంటూ ఆస్తులు పెంచుకుంటూ యువతని నిర్వీర్యం చేస్తూ బ్రతుకుతున్నారు. మేమందరం ఆర్ద్ర నయనాలతో ఆశతో మీలో ప్రవర్తన కోసం చూస్తున్నాం నాన్నా మీలో స్వార్థ చింతన తగ్గుతుండని మా కోసం కూడా మీరు ఆలోచిస్తారనీ ఎదురుచూస్తున్నాం. ఆ మార్పెగానీ మీలో రాకపోతే రాగల భవిష్యత్‌లో టెర్రరిజం

లేదూ? నీలోనూ ఘర్షణ మొదలవలేదూ? ....... ఛీ ఏమిటీ దేశం? ఏమిటి మన భవిష్యత్? అన్న ఆలోచన కలగటం లేదూ?

ఈ పోరాటం నీకూ నాకూ మధ్యగానీ నాకూ రామ్‌లాల్‌కి మధ్యగానీ కాదు. స్వామికీ సుర్యారావుకీ మధ్యకూడా కాదు. మోసపోవటం కూడా తన జీవితంలో ఒక భాగమని ఇప్పటి వరకూ నమ్ముతూ వచ్చిన సామాన్యుడు. కరిమింగిన వెలగపండు లాంటి వ్యవస్థ మీద విసుగుచెంది చేస్తున్న తిరుగుబాటు అగ్ని ప్రక్షాళనం కాదు నాన్నా కావల్సింది రాజకీయ మానసిక సామాజిక మార్పుల్తో కూడిన వ్యవస్థా ప్రక్షాళనం. నా ఈ అర్థింపు నీ ఆత్మ వాంచనా సమర్థింపుల్ని బ్రద్దలు కొట్టి నీ మనసు వరకూ చేరితే మంచిదే. లేకపోతే అనర్థమైన మర్థింపు తప్పదు, ఆలోచించు ....... నా తండ్రిగా కాదు. ఈ దేశపు మేధావిగా.

ఆలోచించు .......

టేప్ రికార్డర్ ఆటోమాటిక్‌గా ఆఫ్ అయిపోయింది.

పరమేశ్వరం అలానే నిల్చుండి పోయాడు. కొన్ని గంటలక్రితం తనూ తన కొడుకుని దగ్గిర కూర్చోబెట్టుకుని తన వాదన వినిపించాలనుకున్నాడు. ఆ పనినే తన కొడుకు మరింత తెలివిగా చేశాడు మరింత కన్విన్సింగ్‌గా చేశాడు.

నేను సామాన్యుణ్ని అన్నాన్నడు అతడు. కాదు అతడు తనకన్నా తెలివయినవాడు. తనలో వున్న ఘర్షణని కూడా కనిపెట్టగల్గినంత తెలివయిన వాడు నిజం చెడు వైపు నిల్చిన ప్రతి వాడిలోనూ ఎంత ఆత్మవంచన చేసుకున్నా ఘర్షణ తప్పదేమో అయితే దేని దారి దానిదే అని బ్రతికేస్తూ వుంటాడు తనూ అంతేనా ....... ఏమో? కాలమే నిర్ణయించాలి.

కానీ దానికి ఎంతోకాలం అవసరం లేకపోయింది. రాబోయే ఘడియ కాలమే అతని భవిష్యత్తుని నిర్ణయించింది.

******

ప్రవల్లికకి క్షణ క్షణానికి అసహనం ఎక్కువ అవుతుంది. విహారి జాడలేదు. ఇదంతా చూడటానికి తను కేవలం ఒక ప్రేక్షకురాలిలా మిగిలిపోతుందా అనుకుంటూ ఉండగా సునాదమాల ఆమె దగ్గిరకి వచ్చింది. పక్కనే విష్ణు వున్నాడు.

మొత్తం ఎంతమంది స్టూడెంట్స్ వచ్చారు? అని అడిగింది.

మా స్కూలు వాళ్ళు ఇంకా చాలా స్కూళ్ళ వాళ్ళు జవాబిచ్చాడు విష్ణు.

ఆమె ఏదో అనబోతూవుండగా జనంలో ఒక్కసారిగా కలకలం వినిపించటంతో తలతిప్పి చూసింది.

ముఖద్వారం నుంచి స్వామి బయటకు వస్తున్నాడు. పట్టుపీతాంబరం ధరించి చేతిమీదుగా వస్త్రాన్ని భుజాంపైకి వేసుకున్నాడు. నుదుటిమీద నాగుపాము తల ఆకారంలో బొట్టు మెరుస్తూంది. అతడు హుందాగా నడుస్తూంటే వెనుక భక్తదళం వస్తోంది. ఎదురుగా ఆకాశంలో

కోపం అతడి మొహంలో తాండవం చేస్తోంది. దాన్ని అణుచుకుంటున్న కొద్దీ ఆ మొహం మరింత ఎర్రబారినట్టు తోస్తూంది.

భక్తులు మరింత బిగ్గరగా జయజయ ధ్వానాలు చేస్తున్నారు.

ఈరోజు ఎంతో సుదినం అనంతానంతస్వామి తన మనసులో భావాల్ని బయట పెడతారు. సహనం నిస్వార్థం భక్తితోటి మతస్తుల పట్ల ప్రేమ. ఈ ఆదర్శాలతో మనం ఎలా మోసగింప బడుతున్నామో అయన చెపుతారు. మన ఐక్యత కోసం ఇన్ని సంవత్సరాలుగా ఆయన చేసిన ప్రార్థనవల్ల పొందిన సారాన్ని మనముందు వుంచుతారు. మన కోసం మన జాతికోసం మన మతం కోసం తన జీవితకాలాన్ని వెచ్చించిన మహానుభావుడు ఆయన దారిద్ర్యంతో, రాజకీయ కుటిలత్వంతో మనకు తెలియకుండానే వేరే మతస్థులు మనకు చేస్తున్న అన్యాయాలతో చాపక్రింద నీరులా పాక్కుంటూ వస్తూన్న ప్రమాదాల గురించి ఆయన వివరిస్తారు.

అక్కడ సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం కనులు మూసుకుంటే అసలక్కడ అంత మంది జనం వున్నారా అని అనుమానం వచ్చేటంత నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దంలోంచి తిరిగి పరమేశ్వరం కంఠం వినిపించింది.

ఉపన్యాసం అయిన తరువాత మన మతోద్ధరణ కోసం స్వామి అగ్నిప్రవేశం చేస్తారు పునీతులయి తిరిగి వస్తే ఆయన మహా పురుషులవుతారు. మన మతోద్ధారణ భగవంతునికి ఇష్టం లేకపోతే స్వామిని ఆయన తనలో కలిపేసుకుంటారు. నిర్ణయం భగవంతుడిదే. మనకోసం స్వామి ఈ ప్రమాదాన్ని చేపడుతున్నారు.

సముద్రకెరటం తెగినట్టు పర్వతం విరిగినట్టు అక్కడ ఒక్కసారిగా శబ్దం ప్రచండమైంది కల్లోలం మిన్నుముట్టింది.

పరమేశ్వరం వేదిక దిగి స్వామి దగ్గిర కొచ్చాడు.

స్వామి తీక్షణంగా అతడివేపు చుశాడు. కంఠం కర్కశంగా పలికింది.

బాగా నటిస్తున్నావు పరమేశ్వరం అద్భుతంగా నటిస్తున్నావు.

స్వామి వెంటనే సర్దుకున్నాడు. మరేమీ మాట్లాడలేదు. వేదిక వైపు నడిచాడు. పరమేశ్వరం అతని వెనుకే నడుస్తూ ఏం జరిగింది స్వామీ అన్నాడు కంగారుగా స్వామి అతడికి సమాధానం చెప్పకుండా చూశాడు అతడి కళ్ళు నిప్పులు చెలరేగుతున్నాయి.

పరమేశ్వరం తిరిగి అదే ప్రశ్న అడిగాడు.

స్వామి అదే కటువైన స్వరంతో “నా కన్నీ తెలిసిపోయాయి. నువ్వూ నీ కొడుకూ ఏకమైన సంగతి. నన్నీరోజు సజీవ దహనం చేయటానికి ఏర్పాటు చేసిన అగ్నిగుండం సంగతీ...” అంటూ చెపుతున్నాడు. ఇంతమంది ప్రజలు ఇక్కడ లేకపోతే నిన్ను నిలువునా చంపేసేవాడిని అన్న అర్థం వచ్చేలా....! పరమేశ్వరం దిగ్భ్రమ చెందాడు. “మీ..రు..... మీరు పొరపాటు పడుతున్నారు” అన్నాడు.

"నీ కొడుక్కి ఇన్ని తెలివితేటలున్నాయంటే నమ్మను నేను. నిశ్చయంగా ఇదంతా నీ తెలివే. రామ్‌లాల్‌ని 'బ్రేక్' చేయటంలోనూ సూర్యారావుని నా నుంచి చీల్చటంలోనూ...."

పరమేశ్వరానికి దుఃఖం వచ్చింది, నవ్వూ వచ్చింది. గెల్చాడు తనమీద తన కొడుకు గెల్చాడు. అతడన్న మాటల్ని స్వయంగా నిరూపించి చూపించాడు. "నాన్నా...... మనది ఆప్యాయతలు దట్టంగా అల్లుకున్న పొదరిల్లు.... అది వ్యాపార బంధాల్తో వేసిన లక్క ఇల్లు. అక్కడ పునాది నమ్మకం, ప్రేమ" అన్న కొడుకు మాటలు గుర్తొచ్చాయి. అయినా తనని తాను కంట్రోల్ చేసుకున్నాడు. సూర్యారావులా అతడు నమ్మకద్రోహి కాడు? రామ్‌లాల్‌లాగా చప్పున ఆవేశంతో నిర్ణయం తీసుకునేవాడు కాదు. జ్ఞానం వున్న వాడు పొరపాటున జ్ఞానాన్ని స్వార్థం వైపు మళ్ళించిన వాడు.

"స్వామీ! ఈ క్షణం మీరు ఆవేశంతో యుక్తాయుక్తాలు మరచి పోయారు. ఎవరో మీ మనసు విరిచేశారు" అన్నాడు.

"అయిదు నిముషాల క్రితమే నాకు నిజానిజాలు తెలిశాయి. ప్రవల్లిక చీఫ్‌తో చెప్పినదంతా విన్నాను."

"లక్షలాది ప్రజలు మీ కోసం వేచి చూస్తున్నారు. మనం తర్వాత ఈ విషయాలన్నీ మాట్లాడుకుందాం. మన మధ్య అపోహలు కలుగచేయటానికి ప్రవల్లిక ఆడిన నాటకం స్వామీ ఇది. ఆ మాటలు నమ్మకండి."

"అంతేనంటావా?"

"మీరే ప్రమాణం చెయ్యమంటే అది చేస్తాను"

"మాటల వరకయితే నమ్మను. కానీ మాటలకి తోడుగా ఋజువులు దొరికితే నమ్మక తప్పదుగా!"

"ఏ ఋజువులు దొరికాయి మీకు?"

"పేపర్ వ్యాన్‌ని నాశనం చేసినట్టు నటించి, నీ కొడుక్కి నువ్వే పేపర్లిచ్చిన సంగతి."

టెన్షన్ పోయినట్టు పరమేశ్వరం నవ్వేడు. "అదే నిజమైతే ఈపాటికి నగరమంతా అట్టుడికిపోయేది. ఇంతమంది జనం వచ్చేవారు కాదు స్వామీ! ఇప్పటికే ఆలస్యమైంది వేదిక నెక్కండి......"

స్వామి మెట్లు ఎక్కుతూ చివరి మెట్టు మీద ఆగాడు. మొహం వెనక్కి తిప్పకుండానే అన్నాడు. "నువ్వు చెప్పినదంతా నిజమయితే అంతకన్నా కావల్సిందేమీ లేదు పరమేశ్వరం. కానీ ఇదే అవకాశంగా మాట్లాడితే, ఈ లోపులో మన మనుషులు నిన్ను గమనిస్తూ ఉంటారన్న సంగతి కూడా మర్చిపోకు----" అంటూ వెళ్ళాడు.

పరమేశ్వరం ప్రతిమలా నిల్చుండిపోయాడు.

కెరటం తర్వాత వచ్చి తీరాన్ని కొట్టినట్టు కొడుకు మాటలు జ్ఞాపికలై వచ్చి మెదడుని

తమ్ముడిని చంపటానికి మరొకడిని పంపుతాడు. హిస్టరీ రిపీట్స్ నాన్నా...."

అతడు అచేతనుడై వుండగానే స్వామి ఉపన్యాసం మొదలైంది. తను తయారు చేసిన ఆ ఉపన్యాసాన్నే అతడు స్వామి నోటివెంట వినసాగాడు.

* * * *

ప్రవల్లిక ఏం చేయాలో తోచనట్టు చూస్తోంది. స్వామి ఉపన్యాసాన్ని జనం మంత్రముగ్ధులై వింటున్నారు. ప్రతి శ్రోత మనసునూ దూసుకు పోతోంది అతడి ఉపన్యాసం.

ముందు 'కల్కి' గురించి చెప్పాడు. మత రక్షణకోసం "కల్కి" ఎలా ఉద్భవిస్తాడో చెప్పాడు. దేవుడి ఏదో అవతారమైన అతడు "హిందూ" దేశాన్ని ఎలా రక్షిస్తాడో చెప్పాడు. ఎక్కడా తనే "కల్కి"నని చెప్పలేదు. కాని జనం ఆవేశంతో ఊగిపోతున్నారు. "స్వామీ నువ్వే కల్కివి" అన్న భావం వాళ్ళ మనస్సు చెలియకట్ట దాటుతూంది. దూరంగా అగ్ని మరింత ప్రజ్వలంగా మండుతూంది. అందులోంచి పునీతుడై వస్తేచాలు..... స్వామి ఏం చేస్తే అది వేగంగా భావించటానికి లక్షలాది జనం సిద్ధంగా వున్నారు.

ప్రవల్లిక నిస్సహాయంగా చూస్తుంది. పరిస్థితి చేజారిపోతున్నట్టు తోస్తుంది. వేదికవైపు వెళుతూ స్వామి, పరమేశ్వరం ఏం మాట్లాడుకున్నారో తెలియలేదు. "తను భావించినట్టు" వారిమధ్య కత్తులు దూసుకునేటంత విభేదాలు రాలేదని తోస్తుంది. ఎప్పుడూ లేనిది ఆమెకు కళ్ళ నీళ్ళ తిరిగాయి.

స్వామి ఉపన్యాసం రెండో అంకంలోకి ప్రవేశించింది. మన దేశంలో "మనకి" జరుగుతున్న అన్యాయం గురించి మాట్లాడుతున్నాడు. సి.బి.ఐ. చీఫ్‌కి కూడా ఏం చేయాలో తోచనంత పకడ్బందీగా వుంది ఆ ఉపన్యాసం! ప్రతీ మాటా నిజం అనిపించేలా వుంది. చివరికి అక్కడున్న పోలీసుల్లో అధిక సంఖ్యాకులయిన ఒక మతస్థులు కూడా ఉత్తేజితులై వింటున్నారు. ఈ క్యాసెట్టు దేశంలోకి వెళితే పరిస్థితి ఏమవుతుందో వూహించటానికే భయంగా వుంది. అన్నీ వాస్తవాలే..... కానీ, కాస్త "విశేషణాలు" కలుపబడ్డాయి. మతస్థులెవర్నీ తిట్టటం లేదు. "మన దౌర్భాగ్యం..... మన దురదృష్టం" లాటి పదాలే ఎక్కువగా వున్నాయి. కానీ, స్వామి మాటల్లో ఏదో హిప్నాటిక్ పవర్ వుంది. జోన్స్, హిట్లర్, రస్‌పుటిక్.... ఈ సంతతికి మాత్రమే వున్న పవర్ అది! ఇక అతడిని ఎవరూ ఆపలేరు. అసెంబ్లీలనీ, పార్లమెంటునీ ధ్వంసం చేసి అతడు నియంత అవటం ఖాయం. జనం ఆవేశంతో వూగి పోతున్నారు, అంకురమే ఇంత బలంగా వుంటే, కొద్ది రోజుల్లో ఇది మహావృక్షం కాకుండా ఎవరాపగలరు? రెండు గుంపుల మీద దాడి చాలు రక్తం ఏరులై ప్రవహిస్తుంది. వాటి మధ్యనుంచి స్వామి లేస్తాడు. తనే కల్కినంటాడు. సింహాసనం అధిష్టిస్తాడు. ఆ తర్వాత మార్షల్‌లా, సైనిక శాసనం..... అగ్రరాజ్యపు ఆధిపత్యం. భారతదేశపు చరిత్రలో అతి హేమమయిన భవిష్యత్తు.

ఎలా దీన్ని ఆపడం?